

**ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు**

వేంపల్లె పట్టణంలోని వివేకానంద రెడ్డి (రెడ్డయ్య) కాలనీలో 15 రోజులుగా తాగునీరు రాలేదని అ కాలనీ మహిళలందరూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. - 8లో



**పాపం.. గుర్రం!**

కడప నగరంలోని రాజీవ్ పార్క్ సమీపంలో సోమవారం సాయంత్రం ఓ బాలుడిని ఎక్కించుకుని వెళుతున్న గుర్రం వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొంది. - 8లో

గరిష్టం/కనిష్టం
**40.1 /24.9**

**వాతావరణం**

జిల్లాలో సోమవారం 24.9 – 40.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

## న్యూస్‌రీల్

### జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి.యామిని



కడప అర్బన్ : వైఎస్సార్ ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి.యామిని నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జి. శ్రీదేవి అనంతపురంలోని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ లేబర్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. కడపలోని ఆరవ అదనపు జిల్లా (ఫ్యామిలీ కోర్టు) జడ్జిగా పనిచేస్తున్న షేక్ ఇంతియాజ్ అహ్మద్ విజయవాడ జిల్లా కోర్టులో 14 అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా కోర్టులో పోక్సో కోర్టు జడ్జ్‌గా పని చేస్తున్న ఎస్.శాంతి కడపలోని ఆరవ అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

### కనీస మద్దతు ధరతో జొన్నల కొనుగోలు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా జిల్లాలో హైబ్రిడ్ రకం జొన్నలు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 3371తో కొనుగోలు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. బద్వేలు, దువ్వూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మండలాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు.ఈ–క్రాప్, ఈకేవైసీ తోపాటు తమ పేర్లు నమోదు చేయించుకున్న రైతుల నుంచి కొనుగోలు చేస్తామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న జొన్నలు మాత్రమే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. హమాలీ, రవాణా ఖర్చులు రైతులే ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం ఈ ఖర్చులను రైతులకు అదనంగా చెల్లిస్తుందన్నారు. గోనె సంచులను పౌరసరఫరాల సంస్థే సరఫరా చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతుందన్నారు.

# వైద్యం.. దైన్యం

కూటమి ప్రభుత్వం మానవత్వం మరిచింది. పేదల ఉచిత వైద్య సేవను నిలిపేసి రోగుల ఆరోగ్యాన్ని గాలికొదిలేసింది. మాటలు కోటలు దాటించే కూటమి నేతలు.. ఆరోగ్యశ్రీ వైద్య సేవ దగ్గరికొచ్చేసరికి 'కోట్ల' బిల్లులు నిలిపేశారు. ఇంకేముంది నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలను నిలిపేయడంతో రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు.

**'ఎన్టీఆర్ వైద్య సేవ'లు బంద్**

- ఉచిత వైద్యం అందక పేదల ఇబ్బందులు
- జిల్లా వ్యాప్తంగా రూ. 120 కోట్లకు పైగా బకాయిలు
- నిధులు అందకపోవడంతో వైద్య సేవలను నిలుపుదల చేసిన నెట్ వర్క్ ఆసుపత్రులు



ఈ వ్యక్తి పేరు అంకన్న. వేముల మండలం, గొందిపల్లె వాసి. రెండు వారాల క్రితం బండి మీద నుంచి కింద పడి కాలుకు గాయమైంది. కుట్లు వేశారు. అప్పుడు ఉచితంగా వైద్య సేవలు అందాయి. ఇప్పుడు చెకప్ కోసం వచ్చారు. వైద్య సేవలను నిలుపుదల చేయడంతో డబ్బులు చెల్లించాల్సి వచ్చింది. ఈ రోజు బంద్ ఉందంట. చాలా మంది వచ్చి వెనక్కి వెళ్లారు. ఉచితంగా వైద్య సేవలు అందకపోతే తమ లాంటి వారి పేదల పరిస్థితి ఏమికావాలని అంకన్న ప్రశ్నించారు. ఉచిత వైద్యం అందకపోతే పేదల పరిస్థితి ప్రమాదకరంగా ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



ఉచిత వైద్యం కోసం వైద్య మిత్ర హెల్ప్ డెస్క్ వద్ద ఆరా తీస్తున్న రోగులు,వారి బంధువులు

కడప రూరల్ : పేదలకు అందించే ఉచిత వైద్యం నిలిచిపోయింది. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ట్రస్ట్ ద్వారా నెట్ వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. 'ఇన్నాళ్లు అప్పులు తెచ్చి ఆసుపత్రులను నడిపాం. ఇకపై ముందుగు సాగలేమ'ని ఆషా (ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి తెలిపింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్య శ్రీ) పథకం ద్వారా పేదలకు అందించే ఉచిత వైద్య సేవలను నిలుపుదల చేశారు.

**పాపం.. ప్రజలు..**

జిల్లా వ్యాప్తంగా నెట్ వర్క్ ఆసుపత్రులు మొత్తం 108 ఉన్నాయి. అందులో 36 ప్రైవేట్ ఆసుపత్రులు. మిగిలినవి ప్రభుత్వ ఆసుపత్రులు. ఈ ఆసుపత్రుల ద్వారా అర్హులకు 3,255 రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించాలి. ప్రతి రోజు దాదాపు 2 వేల మంది రోగులు ఆసుపత్రులకు వస్తుంటారు.కాగా 36 ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోవడంతో, వైద్యం కోసం వచ్చిన పేదలు ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రుల్లో ఉండే వైద్య మిత్రలు వచ్చిన రోగులకు ఈ రోజు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద చూసే వైద్య సేవలు లేవు. ఆసుపత్రుల వారు బంద్‌లో ఉన్నారని చెప్పి పంపించేస్తున్నారు. ఈ సమాధానం విని రోగులు ఆశ్చర్యపోతున్నారు. బందా..ఎప్పుడూ లేదే..? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం కింద ఔట్ పేషెంట్స్‌కు ఫీజు తీసుకోకుండా పేషెంట్‌ను చూడాలి. ఇన్ పేషెంట్స్‌కు అయితే ఉచితంగా వైద్య సేవలు అందించాలి. బంద్ కావడంతో ఔట్ పేషెంట్స్ డాక్టరుకు ఫీజులు చెల్లించి చూపించుకుంటున్నారు. ఆపదలో ఉన్న ఇన్ పేషెంట్స్‌గా అవసరమైన వ్యాధిగ్రస్తుల పరిస్థితి చాలా ఇబ్బందిగా మారింది. ప్రైవేట్‌గా చూపించుకోవాలంటే వేలు దాటి లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

NO Aarogya sri OP
NO EHS OP & IP
DUE TO HOSPITAL IN STRIKE

నెట్ వర్క్ ఆసుపత్రుల వద్ద అంటించిన బంద్ నోటీసు

**ప్రభుత్వం నుంచి బెదిరింపులు..**

నెట్ వర్క్ ఆసుపత్రులకు పెండింగ్ బకాయిలను చెల్లించి, పేదల వైద్యానికి భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోంది. వైద్య సేవలను నిలుపుదల చేసిన ఆసుపత్రుల వివరాలను తెలపాలని ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బందికి ప్రభుత్వం ఆదేశించినట్లుగా తెలిసింది. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయకుండా బెదిరింపు చర్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**బంద్ అంటే ఫీజు చెల్లించాను**



కంటి సమస్యతో కడపకు వచ్చాను. ఆసుపత్రుల వారు ఆరోగ్య శ్రీ కింద అందించే వైద్య సేవలు బంద్ చేశారని చెప్పారు. చేసేదిలేక రూ.300 ఫీజు చెల్లించి డాక్టర్ వద్ద చూపించుకున్నాను. ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందో అర్థం కావడం లేదు.

– రామ్మోహన్, ముద్దనూరు.

### గ్రీవెన్స్‌సెల్‌కు వినతుల వెల్లువ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టర్ కార్యాలయ సభా భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి, ఇతర అధికారులకు తమ సమస్యలు విన్నవించారు.

- లింగాల మండలం తాతిరెడ్డిపల్లె సర్వే నెంబరు 457లో తనకు వారసత్వంగా వచ్చిన 1.41 ఎకరాల భూమిని టీడీపీ నాయకులు సురేంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తులు ఆక్రమించి అరటిమొక్కలు నాటారని కోమన్నూతల గ్రామానికి చెందిన శ్రావణి ఫిర్యాదు చేశారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. టీడీపీ నేతల నుంచి తన భూమిని ఇప్పించాలని కోరారు.
- వీఎన్ పల్లె మండలం అనిమెలలో 1976–77 ప్రాంతంలో దళితులకు మంజూరు చేసిన పట్టా భూములను ఎం.జగదీశ్వర్‌రెడ్డి, జోగిరెడ్డి, రాజారెడ్డి, ఝాన్సీలక్ష్మి తదితరులు ఆక్రమించారని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునెయ్య ఫిర్యాదు చేశారు.
- ఇంజనీరింగ్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న కొంతమంది జాబ్‌కార్డులు పొంది ఉపాధి హామీ సొమ్మును కాజేస్తున్నారని చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీడీఓ సుబ్బారెడ్డి మద్దతుతోనే ఇది జరుగుతోందని ఫిర్యాదు చేశారు.
- బెంగుళూరు–విజయవాడ ఆరు లేన్ల రహదారి నిర్మాణంలో భాగంగా రెండు ఎకరాల తన భూమిని ప్రభుత్వం సేకరించిందని, తన అన్న నరసింహారెడ్డి పేరిట అవార్డు పాస్ చేశారని బ్రహ్మంగారిమఠం మండలం చిన్నాయిపల్లెకు చెందిన పెంచల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అన్ని డాక్యుమెంట్ ఆధారాలు తమకు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు.

## ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు

**జిల్లా వ్యవసాయ అధికారి ఎ. నాగేశ్వర రావు**



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పులివెందుల రూరల్ : భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పులివెందుల, ముద్దనూరు వ్యవసాయ డివిజన్ల పరిధిలోని 9మండలాల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయడంతో పాటు పారదర్శకంగా ఉంటాయన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు కావలసిన నాణ్యమైన ఎరువులను, విత్తనాల ను అందిస్తూ రైతుకు సేవ చేసే దానిలో ఎల్లప్పుడూ ముందు ఉండాలన్నారు. రైతులు సబ్సిడీ యంత్ర పరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

## రిజిస్ట్రేషన్‌కు 19 స్లాట్ బుకింగ్‌లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ సేవలను మరింత సులభతరం చేసేందుకు స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అన్ని జిల్లాల్లో కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. కడప అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికి దస్తావేజులను అందజేశారు. సోమవారం 19 స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి దస్తావేజులను అందజేసినట్లు సబ్ రిజిస్ట్రార్ హరికృష్ణ తెలిపారు. కొత్త విధానంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ సమయం వృథా కాదని, ప్రజలు నిరీక్షించే బాధ తగ్గుతుందన్నారు. అలాగే క్యూఆర్ కోడ్‌తోనూ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు తమ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచామన్నారు.



దస్తావేజును అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్ హరికృష్ణ

## పనులు త్వరగా పూర్తిచేయాలి

**జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి**

సిద్దవటం : ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని సిద్దవటం మండలం లోని కడప– చెన్నై ప్రధాన రహదారికి ఇరువైపులా పారుశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె భాకరాపేట, కనుమలోపల్లె గ్రామాల్లో జరిగే పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ భాస్కర్, ఈఓపీఆర్‌డీ మోహతాబ్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, శివయ్య పాల్గొన్నారు.



రోడ్డుకు ఇరువైపులా జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

## రాయంచపై రామయ్య విహారం

**ప్రణమిల్లిన భక్తజనం**



గ్రామోత్సవంలో అలరించిన కోలాట ప్రదర్శన

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి 7 నుంచి 8:30 గంటలకు హంసవాహనసేవ వైభవంగా జరిగింది. రాములోరు రాయంచపై కొలువుదీరి మాఢవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రామా..మము బ్రోవుమా అంటూ భక్తజనం ప్రణమిల్లారు. ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం సంపూర్ణంగా కలుగుతుంది. హంస వాహనంలోని పరమార్థం ఇదే. హంసకు పాలను, నీళ్లను వేరుచేసే సామర్థ్యం ఉంది. భక్తుల్లో అహంభావం తొలగించి «దాసోహం»అనే భావం కలిగించడానికే పరమహంస రూపానికి ప్రతీక అయిన హంస వాహనాన్ని స్వామి వారు అధిరోహిస్తారు. కోలాటం బృందం నృత్య ప్రదర్శనలు, తాళ భజనలు, మంగళవాయిద్యాలు ముందు సాగుతుండగా రాచ ఠీవితో హంస వాహనంపై నిలిచిన రాములవారు ఒంటిమిట్ట వీధుల్లో విహరించారు. వేలాది మంది తరలి రావడంతో రామయ్య క్షేత్రంలో భక్తజన సందడి నెలకొంది. అంతకు ముందు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వేణుగానాలంకారంలో స్వామివారు ఆలయ నాలుగు మాఢవీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 11 నుంచి కల్యాణవేదిక వద్ద ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరిపారు. అనంతరం స్నపనతిరుమంజనం నిర్వహించారు.



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

**నేటి కార్యక్రమాలు...**

బ్రహ్మోత్సవాలలో మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో శ్రీరాముడు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటల నుంచి సింహ వాహనంపై విహరిస్తారు.

## కోదండరాముడి కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

**మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సవిత**



కల్యాణ వేదిక ఏర్పాట్ల గురించి మంత్రులకు వివరిస్తున్న వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 11న సీతారాముల కల్యాణోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తామని, ఇందుకోసం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్ సవిత సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం ఒంటిమిట్ట టీటీడి కల్యాణ మండపం సమీపంలోని పరిపాల భవన సమావేశ మందిరంలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్ కుమార్, టీడీడీ జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీ విజిలెన్స్ ఎస్పీ విష్ణువర్ధన్ రాజు, జేసీ అదితి సింగ్‌తో కలిసి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 11వ తేదీన సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుందని, అందుకు సంబంధించి ఇప్పటికే దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులకు సూచించారు.ప్రజా భద్రత కోసం సుమారు 150కిపైగా సీసీ, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కడప, రాజంపేట వైపు నుంచే ఆర్టీసీ బస్సులకు పార్కింగ్, అలాగే ఇతర జిల్లాల నుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకొని పక్కాగా ప్లాన్ రూపొందించుకొని పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.మంత్రి సవిత మాట్లాడుతూ కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తుల తోపాటు ప్రముఖులు అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణవేదిక ప్రాంగణాన్ని భక్తులు శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వైఎస్సార్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు, తాగునీటి వసతి కల్పించామన్నారు.108 వాహనాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ విజిలెన్స్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ టీటీడీ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషితో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడతామన్నారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం బ్రహ్మోత్సవాల విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అధికారులను కోరారు.

**కల్యాణ వేదిక పరిశీలన**

అంతకుముందు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సవిత, జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఒంటిమిట్ట కోదండ రామస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం సమీపంలోని కల్యాణ వేదికను వారు పరిశీలించారు.ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి కలెక్టర్ మంత్రులకు వివరించారు. కార్యక్రమంలో కడప, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చిన్నయ్య, టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ నాగరాజు, డీపీఓ రాజ్యలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణయ్య పాల్గొన్నారు.

# కీచక ఉపాధ్యాయులపై చర్యలేవీ?

ఉపాధ్యాయ వనంలో కలుపు మొక్కలను ఏరుతున్నా ఎక్కడికక్కడ మళ్లీ మొలుస్తూనే ఉన్నాయి. దారి చూపాల్సింది పోయి దారి తప్పి అభం శుభం తెలియని చిన్నారులపై బుస కొడుతూనే ఉన్నాయి. ఏడాది పొడవునా ఎక్కడో ఒకచోట ఏదో ఒక పాఠశాలలో పసి మొగ్గలపై దురాగతాలు జరుగుతూనే ఉన్నాయి. గురువులు వారి గురుతర బాధ్యత మరిచి చిన్నారుల పాలబుగ్గలపై కన్నేసి కాటేస్తున్నారు. చాలా పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. బాధిత చిన్నారులు వచీ ౹రాని మాటలతో ఇంటికి వచ్చి మా సార్ ఇలా చేశాడు అని చెప్పేంత వరకూ బయటి ప్రపంచానికి తెలియడంలేదు. చిన్నారులపై ఇలాంటి దురాగతాలకు పాల్పడిన దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం వారి వైపు కన్నెత్తి చూడటం లేదు.

- వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో భయాందోళన
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు

బద్వేలు : బడిలోని చిన్నారులకు అండ దండగా ఉంటూ.. విద్యా బుద్ధులు నేర్పి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన గురువులు దారి తప్పుతున్నారు. బద్వేలు నియోజకవర్గ పరిధిలో వరుసగా జరిగిన మూడు సంఘటనలు తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్ 26 తేదీ పోరుమామిళ్ల మండలం టేకూరుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అదే పాఠశాలలో హిందీ పండిట్‌గా పని చేస్తున్న కలసపాడు మండలానికి చెందిన రత్నమయ్య అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం బాధిత విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పాఠశాలకు చేరుకుని సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. పోరుమామిళ్ల ఎస్‌ఐ కొండారెడ్డి స్పందించి కీచక ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత బద్వేలు పట్టణంలో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 4 వ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అన్వర్‌బాషా అనే ఉపాధ్యాయుడు ఈనెల 2వ తేదీన అసభ్యంగా ప్రవర్తించాడు. తల్లిదండ్రులకు విషయం తెలియడంతో వారు పాఠశాలకు చేరుకుని ఆ ఉపాధ్యాయుడికి బుద్ధి చెప్పారు. ఈ సంఘటన మరువక ముందే బద్వేలు పట్టణంలోని ఏవీఆర్ పాఠశాలలో మరో కీచకుడు అయిన కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్య ఆరవ తరగతి విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.విద్యార్థినులు విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాలకు చేరుకుని పిడిగుద్దులు కురిపించారు. అనంతరం పోలీసులు వచ్చి పెంచలయ్యను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

**కేసు నమోదు చేయించని ప్రధానోపాధ్యాయుడు**

పోరుమామిళ్ల మండలం టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘటనపై ప్రధానోపాధ్యాయుడు రమణయ్య అసలు కేసు పెట్టలేదు. హిందీ ఉపాధ్యాయుడు రత్నమయ్య కొన్నిరోజులుగా పాఠశాలలోని విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నా ప్రధానోపాధ్యాయుడు ఎందుకు మిన్నకుండిపోయారో అర్థం కావడం లేదు. ఈ సంఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి బద్వేలు , మైదుకూరు విద్యాశాఖాధికారులతో విచారణ జరిపించారు. లైంగిక వేధింపులు జరిగింది వాస్తవమని తేలిన తరువాత కూడా ప్రధానోపాధ్యాయుడు కేసు నమోదు చేయించలేదు. ఈ విషయమై పోరుమామిళ్ల ఎస్‌ఐ కొండారెడ్డిని వివరణ కోరగా కేసు పెట్టేందుకు ఎవరూ రాలేదని తెలిపారు. బద్వేలులోని లిటిల్ ఫ్లవర్, ఏవీఆర్ పాఠశాలలో జరిగిన సంఘటనలపై పోక్సో కేసు నమోదు చేశామని వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసిందని బద్వేలు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజగోపాల్ తెలిపారు.

**బాధ్యులపై చర్యలు తీసుకుంటాం**



బద్వేలు నియోజకవర్గంలో జరిగిన వరుస సంఘటనలపై విచారించి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ తెలిపారు. టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘటన జరిగిన సమయంలో తాను జిల్లాలో బాధ్యతలు స్వీకరించలేదన్నారు. ఆ సంఘటనపై విచారించి సంబంధిత ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తానే స్వయంగా ఆయా పాఠశాలలను సందర్శించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## క్లుప్తంగా

### పొగాకు కొనుగోలుకు ముందుకొచ్చిన జీపీఐ కంపెనీ

బి.కోడూరు : మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పొగాకు కొనుగోలుకు ఎట్టకేలకు జీపీఐ కంపెనీ ముందుకు వచ్చింది. మండల రైతుల నుంచి ఒత్తిడి అధికం కావడంతో సోమవారం నుంచి పొగాకును కొనుగోలుకు కంపెనీ సిద్ధమైంది. జీపీఐ కంపెనీ వారు పొగాకు కొనుగోలుకు ముందుకు రావడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మందు పిచికారీతో పంట నష్టం



మందు పిచికారీతో ఎండిపోయిన పంట

ఖాజీపేట : పంటకు తెగులు సోకిందని మందు పిచికారీ చేస్తే చేతికి వచ్చిన పంట పూర్తిగా ఎండిపోయిందని బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. ఖాజీపేట మండలం కొత్త ఏటూరు గ్రామానికి చెందిన వీరభద్ర అనే రైతుకు రెండు ఎకరాల పొలం ఉంది. పొలంలో పచ్చపెసర సాగు చేశాడు. పంటకు తెగులు సోకడంతో ప్రొద్దుటూరుకు చెందిన ఒక దుకాణంలో మందు కొనుగోలు చేశాడు. మందు పిచికారీ చేశాక సాయంత్రం కల్లా పంట పూర్తిగా ఎండిపోయింది. పంటకు సక్రమమైన మందు ఇచ్చి ఉంటే ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని రైతు తెలిపాడు. ఎకరాకు రూ.50వేలు ఖర్చయిందని, కేవలం మందు పిచికారీ కారణంగా పంట పూర్తిగా నష్టపోయానని వాపోయాడు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

### డ్వాక్రా మహిళలకు కుచ్చుటోపీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఎర్రగుడిపల్లెలో సత్య ఫైనాన్స్ కంపెనీ పేరుతో కొంతమంది వ్యక్తులు ఎర్రగుడిపల్లెలో మహిళా స్వయం సహాయ బృందాల మహిళలకు కుచ్చు టోపీ పెట్టారు. ఎర్రగుడిపల్లెలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న డ్వాక్రా మహిళల వద్దకు సోమవారం సత్య ఫైనాన్స్ కంపెనీకి చెందిన కొందరు వ్యక్తులు వెళ్లారు. తమ కంపెనీ కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్టణంతోపాటు తెలంగాణ వ్యాప్తంగా ఉందని చెప్పారు. అక్కడ మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు రూ.2వేలు తమ అకౌంట్‌లో వేయగా, వారికి గంటలో రూ.50వేలు ఇస్తున్నామని తెలిపారు. అదే మాదిరి మీకు కూడా ఇస్తామని నమ్మ బలికారు. దీంతో సుమారు 18మంది డ్వాక్రా మహిళలు రూ.2వేల చొప్పున సుమారు 12మంది అకౌంట్లలో జమ చేశారు. ఏపీజీబీ అధికారులకు అనుమానం వచ్చి అకౌంట్లలో డబ్బులు జమ చేస్తున్న మహిళలను విచారించారు. వారు ఈ విషయం చెప్పడంతో వెంటనే బ్యాంకు అధికారులు అప్రమత్తమై మిగిలిన డ్వాక్రా సంఘాల మహిళలు డబ్బులు వేయకుండా నిలిపివేశారు. సత్య ఫైనాన్స్ కంపెనీ పేరుతో మోసగించే ప్రయత్నం చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పెంచి అనంతపురం వాసులకు స్పెషల్ గ్రీవెన్స్

జమ్మలమడుగు : గండికోట ముంపు గ్రామమైన పెంచి అనంతపురం వాసులకు ఈనెల 16వ తేదీన ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఆదిమూలపు సాయిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో గండికోట ముంపు వాసులుగా ప్రకటించడం కోసం సర్వే నిర్వహించి గెజిట్ విడుదల చేశామన్నారు. అయితే అందులో 152 మంది తమకు అన్యాయం జరిగిందని తమను ముంపు బాధితుల జాబితాలో చేర్చాలంటూ కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు 152 మందికి స్పెషల్ గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈనెల 16వతేదీన ఆర్డీఓ కార్యాలయ ఆవరణంలో ముంపు వాసులు తమ ఆధార్ కార్డు, బియ్యం కార్డు, ఓటర్ల జాబితా, బ్యాంక్ పాసు పుస్తకం, విద్యార్హత ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ముంపువాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### పేదల సొంతింటిపై చిత్తశుద్ధి లేని కూటమి



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప సెవెన్‌రోడ్స్ : పేదలకు సొంతిల్లు ఉండాలన్న విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్హులందరికీ రెండు సెంట్ల స్థలం, టిడ్కో ఇల్లు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. పెండింగ్ పనులు తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ అధ్యక్షతన జరిగిన నిరాహార దీక్ష కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, బాదుల్లా, సుబ్రమణ్యం, మునెయ్య, మనోహర్‌రెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీపీపీలో చోరీ కేసులో నిందితుడి అరెస్టు



చోరీ కేసులో నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు క్వార్టర్స్‌లో ఫిబ్రవరి నెలలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితుడు గణపత్ దావర్ (25)ను అరెస్టు చేసినట్లు కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం కలమల్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ తిమోతితో కలసి నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని థార్ జిల్లా కుక్షి తాలూకాలోని సర్వాలి గ్రామానికి చెందిన జవర్‌సింగ్ కుమారుడు గణపత్ దావర్ చెడు వ్యసనాలకు బానిసయ్యాడన్నారు. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి తమ అవసరాలకు తప్పుడు మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్మాగారాలు, పెద్దపెద్ద అపార్ట్‌మెంట్‌లను ఎంచుకుని దొంగతనాలు చేస్తున్నారన్నారు. ఆర్టీపీపీలోని క్వార్టర్స్‌లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్నారని తెలిపారు. ఇలా ఫిబ్రవరి నెలలో 9.10 తేదీల మధ్య రాత్రి సమయంలో ఆరు ఇళ్లలో దొంగతనాలు చేశారన్నారు. సుమారు రూ.2,40,000లు విలువ గల బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కలమల్ల ఎస్‌ఐ తిమోతి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సోమవారం నిందితులు మళ్లీ దొంగతనాలు చేసేందుకు వచ్చారని అందిన సమాచారం మేరకు ఎర్రగుంట్ల– ముద్దనూరు మార్గంలోని కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిందితుడు గణపత్ దావర్‌ను అరెస్టు చేశామన్నారు. మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసులో ఆధారాలను సేకరించడంలో, నేరస్తుల ఆచూకీ కనిపెట్టడంలో తన నైపుణ్యాన్ని చూపిన ఎస్‌ఐ తిమోతి, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీ, కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీలు అభినందించారు.



## మహిళపై హత్యాయత్నం కేసులో మరో ఇద్దరి అరెస్టు



హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ మోహన్

ఖాజీపేట : పుల్లూరు పీడబ్ల్యూ బంగళా వద్ద భాగ్య అనే మహిళపై జరిగిన హత్యాయత్నం కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విషయంలో ఈమెపై హత్యాయత్నం జరిగింది. డ్రైవర్ శివకృష్ణకు గాయాలయ్యాయి. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరితో పాటు కొప్పులోలు వెంకట సూర్య చంద్రారెడ్డి (23) షేక్ మహమ్మద్ రఫీ (38)లను రావులపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసి వారి వద్దనుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ఇప్పటికి 8 మందిని అరెస్టు చేశామని మరి కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేయాల్సి ఉందన్నారు.

## పెన్నా నదిలో పడి వృద్ధుడి మృతి



పెన్నా నదిలో తేలుతున్న చిన్న వెంకటేష్ మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరానికి చెందిన ఇల్లూరు చిన్న వెంకటేష్ (73) అనే వృద్ధుడు స్నానం చేసేందుకు పెన్నా నదిలో దిగి ఊపిరాడక మృతి చెందాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన చిన్న వెంకటేష్ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించసాగారు. ఈ క్రమంలో పెన్నానదిలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేష్ పశువుల వ్యాపారం చేసేవాడు. అతనికి భక్తి ఎక్కువ. పెన్నానదిలో స్నానం చేసి గుడికి వెళ్లేవాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం రెండు కుళాయిల సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. స్నానం చేసేందుకు అక్కడ ఉన్న నీళ్లలో దిగాడు. ఈ క్రమంలో సోమవారం అతని మృతదేహం నీళ్లలో తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. లోతు ఎక్కువగా ఉన్న కారణంగా ఊపిరాడక మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అతనికి ఆయాసం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### పాపం.. గుర్రం!

**రోడ్డు డివైడర్‌ను ఢీకొని మృతి**

కడప అర్బన్ : కడప నగరంలోని రాజీవ్ పార్క్ సమీపంలో సోమవారం సాయంత్రం ఓ బాలుడిని ఎక్కించుకుని వెళుతున్న గుర్రం వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో గుర్రం అక్కడికక్కడే రక్తపు మడుగులో కుప్పకూలిపోయింది. గుర్రంపైకి ఎక్కిన బాలుడు గాయపడటంతో వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. ఈ దృశ్యాన్ని చూసినవారు అయ్యో పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గుర్రం యజమాని ఎవరు.. ఆ సమయంలో గుర్రం ఎలా అదుపుతప్పింది అనే వివరాలు తెలియాల్సి ఉంది.



రక్తపు మడుగులో మృతి చెందిన గుర్రం

## ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



వివేకానందరెడ్డి కాలనీలో ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని నిలదీస్తున్న వివేకానందరెడ్డి కాలనీ మహిళలు

**ఎమ్మెల్సీ కారును అడ్డగించి సమస్య తీర్చాలని నిలదీత**

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని వివేకానంద రెడ్డి (రెడ్డయ్య) కాలనీలో గత 15 రోజులుగా తాగునీరు రాలేదని అ కాలనీ మహిళలందరూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్సీ కారును ఆపి మహిళలు తాగునీటి ఇబ్బందులను తొలగించాలని ముట్టడించారు. దీంతో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కారు దిగి వచ్చి వివేకానంద రెడ్డి కాలనీలో ఉన్న నీటి సమస్యను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఉగాది పండుగ ముందు నుంచి తమ కాలనీకి తాగునీటిని సరఫరా చేయలేదని, నీటికి ఇబ్బందులు ఉండడంతో ఖాళీ బిందెలతో రోడ్డెక్కాల్సి వచ్చిందని వివరించారు. ప్రతిసారి మోటార్ కాలిపోయిందని సిబ్బంది చెబుతున్నారని, వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండటంతో చిన్నపిల్లలతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ సిబ్బందికి ఫోన్ ద్వారా తెలిపితే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారన్నారు. తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు. రెండు రోజుల్లోగా వివేకానంద రెడ్డి కాలనీకి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో మహిళలు నిరసన విరమించారు.

**పోటాపోటీగా ట్యాంకర్లతో నీటి సరఫరా**

స్థానిక వివేకానంద రెడ్డి (రెడ్డయ్య కాలనీ)లో నీటి సమస్య ఉండడంతో పోటాపోటీగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ (ఎమ్మెల్సీ వర్గం) నాయకులు నీటి ట్యాంకర్లను పెట్టి నీటిని సరఫరా చేశారు. సోమవారం వివేకానంద రెడ్డి కాలనీకి చెందిన మహిళలు నిరసన తెలపడంతో ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కమతం రాజా, వార్డు మెంబర్ గణేష్ ప్రసాద్‌లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు దృష్టికి తెచ్చారు. అలాగే ఎమ్మెల్సీ వర్గానికి చెందిన టీడీపీ నాయకులకు కూడా విషయం తెలియడంతో అటు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, ఇటు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆదేశాల మేరకు వివేకానంద రెడ్డి కాలనీ ప్రజలకు నీటి ట్యాంకర్ల ద్వారా ఇరు పార్టీల నాయకులు నీటిని సరఫరా చేశారు. అలాగే కాలనీ వాసులకు నీటి ఇబ్బందులు లేకుండా తాగునీటి బోరును కూడా వేస్తామని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు.

## ఉప సర్పంచ్ ఎన్నికలో ఓటమి తప్పదనే టీడీపీ అరాచకాలు

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి**



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఇతర నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికలో ఓటమి తప్పదని గ్రహించి టీడీపీ అరాచకాలు సృష్టించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ ఎన్నిక సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు ఆయన సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ ఎస్పీకి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికకు సంబంధించి 20 మంది వార్డు మెంబర్లు ఉండగా 19 మంది వైఎస్సార్‌సీపీ, కేవలం ఒక్క వార్డు సభ్యుడు మాత్రమే టీడీపీ మద్దతుదారుడు ఉన్నాడన్నారు. ఒక్క సభ్యుడిని పెట్టుకుని వైస్ సర్పంచ్ పదవి కావాలని కోరడం దారుణమన్నారు. దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ, ప్రపంచంలోగానీ జరిగే అవకాశం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఈ ఎన్నిక సందర్భంగా ఏకంగా పోలీసుల మద్దతుతోనే టీడీపీ నేతలు అరాచకాలు సృష్టించారన్నారు.తమను లోనికి రానీయకుండా టీడీపీ చోటామోటా నేతలు దుర్మార్గమైన నీచమైన సంస్కృతికి తెర తీశారన్నారు. నకిలీ మనుషులను ఏర్పాటు చేసి, నకిలీ ఐడీ కార్డులు తయారు చేసి వారిని పంచాయతీ వార్డు సభ్యులుగా తీసుకు వస్తే పోలీసులు వారిని లోనికి పంపించారన్నారు. ఈ నేపథ్యంలో లోపలున్న అధికారులు ఒప్పుకోకపోతే ఆయా అధికారులను బండబూతులు తిట్టారన్నారు. తమ వారిపై పోలీసుల సమక్షంలోనే దాడి చేస్తే తిరిగి తమ వారినే పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించారన్నారు. తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయకపోగా తమకు చెందిన 100 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సోదరుడు భార్గవరెడ్డి ఎన్నిక జరిగే పంచాయతీ కార్యాలయంలో కూర్చుని తన మనుషులతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరించే ప్రయత్నాలు చేశారన్నారు. టీడీపీ వారికి ఓటమి తథ్యమనుకున్న తరుణంలో వారు ఎన్నికల అధికారి రామాంజనేయ రెడ్డి చేత గుండెపోటు డ్రామా ఆడించారన్నారు. ప్రొద్దుటూరులో తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయకపోవడంతో కడపలో జరిగే గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు రాఘవేంద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని, నకిలీ ఐడీ కార్డులు సృష్టించిన, ఆయా ఐడీ కార్డులను అడ్డం పెట్టుకుని ఎన్నికల హాలులోకి వచ్చిన వారిపై, ఎన్నిక సందర్భంగా అధికారులను బెదిరించిన వారిపై, వీధి రౌడీలను ఎన్నికల్లో పాల్గొనేందుకు అనుమతించిన పోలీసు అధికారులపై చర్యలు చేపట్టి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వివిధ కారణాలతో ఎస్పీ తమకు న్యాయం చేయకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని, ఆపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, ప్రొద్దుటూరును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు బలిదానం చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, గోపవరం సర్పంచ్ మోషె, ఉప సర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎదుట ఆందోళన

**టీడీపీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి స్థలాలను కబ్జా చేశారని ఆరోపణ**

కడప రూరల్ : కడపలో నిర్వహించే మహానాడు కోసం స్థల పరిశీలనకు వచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎదుట అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆయన సోమవారం మధ్యాహ్నం ఎయిర్‌పోర్ట్ నుంచి పుత్తా ఎస్టేట్‌కు వస్తున్న సమయంలో బిల్టప్ వద్ద కొంతమంది ఆయన వాహనాన్ని అడ్డగించారు. ఆలంఖాన్‌పల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి తమ స్థలాలను కబ్జా చేశారని, న్యాయం చేయాలని ఆందోళన చేశారు. దీంతో వాహనం దిగిన పల్లా శ్రీనివాసరావు ఎందుకీ..డ్రామా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అందుకు ఆందోళనకారులు తమ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, తమకు న్యాయం చేయాలని కోరారు. అందుకు ఒక పద్ధతి ఉంటుందని, ఇలా చేయడం తగదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు వారికి హితవు పలికారు.

**ఇదంతా సొంత పార్టీ వారి పనేనా?**

కడప టీడీపీలో వర్గ పోరు నడుస్తోంది. ఒకరంటే మరొకరికి గిట్టడం లేదు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి ఆధిపత్య పోరు నడుస్తోంది. దీంతో ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటున్నారు. భూ ఆక్రమణల ఆరోపణల అంశాలను అటుంచితే ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా జరగలేదనే చర్చ సాగుతోంది. సొంత పార్టీలో ఉన్నవారే ప్రణాళిక ప్రకారం ఏకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎదుట ఇలా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా కడపలో మహానాడు నిర్వహించే లోపు ఇంకా ఎన్నెన్ని రాజకీయాలు, నాటకీయ పరిణామాలు చూడాల్సివస్తుందో అని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

## మహిళ మృతి



మృతి చెందిన నరసమ్మ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొర్రపాడు రోడ్డులోని సన్ షైన్ కౌంటీ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో బండ నరసమ్మ (65) అనే మహిళ మృతి చెందింది. సోమవారం రాత్రి ఈ ప్రాంతంలో మహిళ మృతి చెందిందని సమాచారం రావడంతో టూ టౌన్ సీఐ సదాశివయ్య సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి గురించి ఆరా తీయగా దువ్వూరు మండలంలోని పుల్లారెడ్డిపేటకు చెందిన నరసమ్మగా గుర్తించారు. ప్రొద్దుటూరులోని ఓ హోటల్‌లో ఆమె పని చేస్తుంటుంది. సోమవారం రాత్రి కూడా హోటల్‌లో పని చేసినట్లు స్థానికులు తెలిపారు. హోటల్‌లో పని పూర్తి అయిన అనంతరం ఆమె షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు వచ్చి కొంత సేపు కూర్చున్నదని, కొద్ది సేపటి తర్వాత మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. ఆమె శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. గుండె పోటుతో మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. నరసమ్మ భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. వనిపెంటలో ఉన్న ఆమె కుమార్తెకు తల్లి మృతి చెందిన విషయాన్ని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.